నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ ఆదివారం 29 డిసెంబర్ 2024 | ADILABAD NIRMAL

సీఆర్టీల దీక్షకు మద్దతు తెలిపి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఉట్నూర్, డిసెంబర్28 : సీఆర్టీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ డిమాండ్ చేశారు. శనివారం ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట సీఆర్టీలు చేపట్టిన రిలే దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఆర్టీలు దీక్షలు చేపట్టి 13 రోజులైనా రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఓ వైపు సీఆర్టీలు రోడ్కెక్కగా మరోవైపు గిరిజన విద్యార్థులకు విద్యాబోధన అందడం లేదని అయినా ప్రభుత్వం పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నదన్నారు. వెంటనే సీఆర్టీల సమస్యలు పరిష్కరించి వారికి న్యాయం చేయాలన్నారు. అనంతరం సీఆర్టీలకు రూ.25 వేలను ఆర్థికసాయంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి అందజేశారు. సీఆర్టీలు పట్టణంలో ర్యాలీ తీసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్ రావు, పెందూర్ పుష్పారాణి, రాజేశ్, పలువురు నాయకులు ఉన్నారు.

తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

పెంబి, డిసెంబర్ 28: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శనివారం తహసీల్ కార్యాలయం ఆవరణలో ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు మద్దతు పలికారు. ఐదు నెలలుగా ప్రభుత్వం నుంచి ఎలాంటి బిల్లులు రాకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వెంటనే బిల్లులు చెల్లించి, కార్మికులకు కనీసవేతనాలు చెల్లించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్, కార్మికులు మెంట్ల లక్ష్మి, రంభుబాయి, అనసూయ, రాజవ్వ తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ కలెక్టరేట్ఎదుట ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు, నాయకులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తాం
- కలెక్టరేట్ ఎదుట గ్రామ పంచాయతీ కార్మికుల నిరసన

ఎదులాపురం, డిసెంబర్ 28: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని సీఐటీయూ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న అన్నారు. శనివారం తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్(సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. 6 నెలలు నుంచి వేతనాలు అందక చాలీచాలని వేతనాలతో పని చేస్తూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. జీవో నం.51ని సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి కేటగిరి వారీగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్యామలా దేవికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంద్రాజ్ అక్కిన పెళ్లి లక్ష్మన్న, రాజు, రఫీ, మోహన్,అరవింద్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ జిల్లా బేలలో జిన్నింగ్ మిల్లు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

పత్తి కొనుగోళ్లు చేయాలని రైతుల ధర్నా

బేల, డిసెంబర్ 28 : సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆదిలాబాద్ జిల్లా బేల మండల కేంద్రంలోని అషాపుర జిన్నింగ్ మిల్లు వద్ద రైతులు రాస్తారోకో చేశారు. బేల ఎస్ఐ దివ్య భారతి, తహసీల్దార్ రఘునాథ్‌రావు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. శుక్రవారం పత్తి కొనుగోళ్లకు టోకెన్లు ఇచ్చి కొనకుండా సీసీఐ అధికారులు జాప్యం చేస్తున్నారని రైతులు మండిపడ్డారు. జిన్నింగ్ మిల్లులో స్థలం ఉన్నా కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు అధికారులు చెప్పడంతోనే ధర్నా చేపట్టినట్లు తెలిపారు. తహసీల్దార్ ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సీసీఐ అధికారులతో మాట్లాడి పత్తి కొనుగోళ్లు చేపడతామని కలెక్టర్ చెప్పడంతో రైతులు శాంతించారు. అనంతరం సీసీఐ అధికారులతో కలిసి పత్తి వాహనాలను కొనుగోళ్లు చేశారు. ఆశాపుర జిన్నింగ్‌లో మాత్రం సీసీఐ అధికారులు తీరు ఇష్టారాజ్యంగా కొనసాగుతుందని రోజుకు 70 వాహనాల పత్తినే తీసుకుంటామని లేదా జిన్నింగ్ బంద్ చేస్తామని హెచ్చరిస్తున్నారని రైతులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచే పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తే ఇబ్బందులుండవని రైతులు సూచించారు.

కేసీఆర్‌పై యువరైతు అభిమానం

కేసీఆర్ అక్షరాలు కనిపించేలా పెంచిన నారు

ఖానాపూర్, డిసెంబర్ 28: ఖానాపూర్ మండలంలోని తర్లపాడు గ్రామానికి చెందిన యువరైతు బొరువొంతుల నగేశ్ తెలంగాణ తొలి సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై అభిమానాన్ని చాటుకున్నాడు. తన కున్న పొలంలో కేసీఆర్ అనే ఆంగ్ల అక్షరాల ఆకారంలో వరి నారు పెంచి ఆకట్టుకునేలా తీర్చిదిద్దాడు.

నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ ఆదివారం 29 డిసెంబర్ 2024 | ADILABAD NIRMAL

ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేర్లు మిస్సింగ్

దరఖాస్తుదారుల ఆందోళన

నిరసన తెలుపుతున్న దరఖాస్తులు దారులు

కుంటాల, డిసెంబర్, 28: కాంగ్రెస్ సర్కార్ ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఇండ్లు లేని పేదలు దరఖాస్తులు సమర్పించారు. ఇటీవల విడుదలైన జాబితాలో అర్హులైనప్పటికీ పేర్లు లేకపోవడంతో కుంటాల మండల కేంద్రానికి చెందిన పలువురు దరఖాస్తుదారులు ఆందోళనకు గురయ్యారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సాంకేతిక కారణాలతో కొందరి పేర్లు గల్లంతయిన మాట వాస్తవమేనని, పేర్లు రాని వారు కార్యాలయంలో అర్జీలు ఇవ్వాలని ఎంపీడీవో లింబాద్రి సూచించారు.

సమ్మె శిబిరంలో మద్దతు తెలిపి మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

హామీలను విస్మరించిన కాంగ్రెస్

రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటతోనే ఎస్ఎస్ఏ ఉద్యోగ, ఉపాధ్యాయులు రోడ్డెక్కారు

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- కలెక్టరేట్ ఎదుట ఉద్యోగుల అర్ధనగ్న ప్రదర్శన

ఎదులాపురం, డిసెంబర్28: కాంగ్రెస్ పార్టీ ఎలాగైనా అధికారంలోకి రావాలని ప్రజలకు ఎన్నో హామీలిచ్చిందని, ప్రస్తుతం వాటిని విస్మరించిందని, ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలంటూ ఎస్ఎస్ఏ ఉద్యోగ, ఉపాధ్యాయులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి తెచ్చారని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ విమర్శించారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె శిబిరాన్ని ఆయన శనివారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ..కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందు ఏ గ్రామంలో పోయిన అక్కడ ఓ డిక్లరేషన్ ఇచ్చిందని కానీ దాన్ని అమలు చేయడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలతో నేడు ఉపాధ్యాయులు విధులు బహిష్కరించి రోడ్డుపైకి వచ్చారని దీంతో పాఠ్యాంశాల బోధన లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు మూతపడ్డాయని తెలిపారు. తెలంగాణ వచ్చిన తర్వాత మాజీ సీఎం కేసీఆర్ చాలా హామీలు అమలు చేశారని గుర్తు చేశారు. ఎన్నికల్లో సాధ్యంకాని హామీలు ఇచ్చి అమలును పట్టించుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల భర్తీ నోటిఫికేషన్‌ను పూర్తి చేసి తాము ఉద్యోగాలిచ్చినట్లు గొప్పలు చెబుతున్నారని ఆరోపించారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ సంఘ అధ్యక్షుడు తిరుమల గౌడ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలున్నారు.

కలెక్టరేట్ ఎదుట అర్ధనగ్న ప్రదర్శన

తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ చేపట్టిన సమ్మెలో భాగంగా 19వ రోజు శనివారం కలెక్టరేట్ ఎదుట అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి హామీ మేరకు రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల రాష్ట్ర అధికార ప్రతినిధి పడల రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ధరం సింగ్, పార్థసారథి, దేవదర్శన్, ప్రకాశ్, ప్రియంక, రాజన్న, శ్రీకాంత్, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ సంఘీభావం..

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 28 : నిర్మల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగ, ఉపాధ్యాయులు చేపట్టిన సమ్మెకు ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అమలుకు నోచుకోని హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డికి ఇచ్చిన హామీలు ఇంకా గుర్తుకు రావడం లేదా ? అని ప్రశ్నించారు. 19 రోజులుగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు సమ్మె చేస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గు చేటు అని మండిపడ్డారు. కేంద్రంతో చర్చించి వీరి సమస్యలను పరిష్కరించాలని మంత్రులకు వివరిస్తామని, రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నిర్మల్‌లో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

అమరవీరుల స్తూపం వద్ద నివాళులు..

ఇటీవల ప్రాణాలు కోల్పోయిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు మున్సిపల్ కార్యాలయ ఎదుట గల అమరవీరుల స్తూపం వద్ద ఎస్ఎస్ఏ ఉద్యోగ, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల్లో 150 మంది ప్రాణాలు కోల్పోయారని ప్రభుత్వం మృతి చెందిన కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి, తమ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంగాధర్, రాజారత్నం, నరేశ్, తిరుపతి, నవిత, వీణ, అపర్ణ, పుష్పలత,రాధిక, శ్రీతల, గంగామణి, ప్రభ, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ కలెక్టరేట్ఎదుట అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మా పిల్లలను ఇండ్లకు పంపించండి

- కేజీబీవీ ఎదుట తల్లిదండ్రుల ఆందోళన
- విద్యా బోధన అందడం లేదని, నాణ్యత లేని భోజనం పెడుతున్నారని ఆగ్రహం

సారంగాపూర్, డిసెంబర్ 28 : 'ఉపాధ్యాయులు సమ్మెలో ఉండి విద్యా బోధన అందించలేనప్పుడు పిల్లలు ఇక్కడ ఎందుకు? ఇండ్లకు పంపించండి' అంటూ నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని జామ్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం వద్ద శనివారం విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు. . ఉపాధ్యాయులు సమ్మె మూలంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులకు విద్యాబోధన అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉడికీ ఉడకని అన్నం పెడుతున్నారని ఆరోపించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు లేనందున తమ పిల్లలను వెంటనే ఇంటికి పంపించాలని ఎంఈవో మధుసూదన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల గేటు వద్ద ఆందోళన చేశారు. దీంతో అధికారులు కొంతమంది విద్యార్థినులను ఇంటికి పంపించారు. శనివారం వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఆరుగురు ఉపాధ్యాయులు, ఎంఈవో కేజీబీవీలో విధులు నిర్వహించారు.

నాణ్యతలేని భోజనం పెడుతున్నారని ఆగ్రహం..

దిలావర్‌పూర్ డిసెంబర్ 28 : నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్ కస్తూర్బాగాంధీ పాఠశాలలో అల్పాహారంలో(దొడ్డు అటుకుల్లో) పురుగులు వచ్చాయని, నాణ్యతలేని భోజనం అందిస్తున్నారని శనివారం ఉదయం విద్యార్థినులు తెలుపడంతో వారి తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకున్నారు. భోజనాన్ని తాము పరిశీలిస్తామని తల్లిదండ్రులు కోరగా పాఠశాల సిబ్బంది వారిని లోనికి అనుమతించకపోవడంతో ఆందోళనకు దిగారు. తహసీల్దార్ స్వాతి, ఎంఈవో శంకర్ అక్కడికి చేరుకొని విద్యార్థినులను గేటు వద్దకు తీసుకెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడించారు. ఉపాధ్యాయులు సమ్మెలో ఉండడంతో కొంత ఇబ్బందులు వచ్చాయని, విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందిస్తామని, ఇతర పాఠశాలల ఉపాధ్యాయులతో విద్యా బోధన అందిస్తామని ఎంఈవో హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులు శాంతించారు.

జామ్ కేజీబీవీ పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

దిలావర్‌పూర్ కస్తూర్బా లో గేటు వద్ద తల్లిదండ్రులతో మాట్లాడుతున్న విద్యార్థినులు

మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 28 : జిల్లాలో ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం నిర్మల్ కలెక్టరేట్‌లోని సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన నిర్మాణాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందుకు అవసరమయ్యే ఇసుకను కేవలం నిబంధనల మేరకే సేకరించాలని గుత్తేదారులకు ఆదేశాలు జారీ చేశారు. అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేసి అక్రమంగా ఇసుక తవ్వకాలు, రవాణాను అరికట్టాలన్నారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో మైన్స్ ఏడీ రవీందర్, ఇంజినీరింగ్ శాఖల అధికారులు శంకరయ్య, అశోక్ కుమార్, సందీప్ తదితరులున్నారు.

భిక్షాటన నియంత్రణకు చర్యలు చేపట్టాలి

భిక్షాటన నియంత్రణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం నిర్మల్‌లోని బాలల సంక్షేమ కమిటీ కార్యాలయాన్ని ఆమె అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి పరిశీలించారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు, బాల్య వివాహాల నియంత్రణ, అనాథ బాలల గుర్తింపు, తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో జనవరి 1 నుంచి భిక్షాటనను నియంత్రించాలని, భిక్షాటన చేస్తున్న వారిని గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. ఇందుకు పోలీస్ శాఖ ద్వారా ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి మురళి, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య విషయాలపై అవగాహన ఉండాలి

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

లక్ష్మీపూర్‌లో పుస్తకావిష్కరణలో పాల్గొన్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

జైనథ్, డిసెంబర్ 28 : సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్య విషయాలపై అవగాహన కలిగి ఉండాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా సూచించారు. శనివారం జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత ఆరోగ్య పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులతోపాటు ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతో పాటు పౌష్టికాహారం, ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవడంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు రచించిన లక్ష్మీపూర్ బడి పిల్లల కథల పుస్తకాలను అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈవో టీ ప్రణీత, మండల ప్రత్యేకాధికారి భాస్కర్, తహసీల్దార్ శ్యాం సుందర్, డిప్యూటీ తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి, ఎంపీవో జీ వెంకట్‌రాజ్, ఎంఈవో జీ శ్రీనివాస్, హెచ్ఎం పీ అశోక్, లక్ష్మీపూర్ వీడీసీ చైర్మన్ దాసరి నారాయణ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.